ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

ఆదివారం 30 జూన్ 2024

- అడ్డగోలు ఉత్తర్వులతో జీతాలు
- అర్హత లేకపోయినా కీలక బాధ్యతలు
- సొంతవారికి ఇష్టారీతిన ఉద్యోగోన్నతులు
- అవుట్‌సోర్సింగ్ నియామకాలతో వసూళ్లు



దేవదాయం.. దోపిడీ



గుంటూరులోని దేవదాయ శాఖ కార్యాలయం

ఆధ్యాత్మికంగా ఉంటూ.. హిందూ ధర్మ ప్రచారంతో పాటు.. ఆలయాల అభివృద్ధి.. భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన.. దేవదాయశాఖ అధికారులు కొందరు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయ శాఖను దోపిడీకి కేంద్రంగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సొంత అజెండాతో ప్రభుత్వం చెలరేగగా.. తామేమీ తీసిపోమన్నట్లుగా దేవదాయశాఖలోని కొందరు అధికారులు అదేబాట పట్టారు. అడ్డగోలు ఉత్తర్వులు.. ఇష్టం వచ్చినట్లు నిధులు డ్రా.. ఒక పద్ధతి లేకుండా ఉద్యోగోన్నతులు.. అర్హత లేకపోయినా కీలక బాధ్యతలతో కొందరు అధికారులు దేవదాయ శాఖలో పెత్తనం సాగించారు. గడిచిన 5 ఏళ్లుగా గుంటూరు జిల్లా దేవదాయ శాఖలో కొందరు అధికారులు తిష్ట వేసి భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు సొంతశాఖలోని ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి తన అనుయాయులను వెంటేసుకుని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో పెత్తనం చెలాయిస్తూ ప్రతీ పనికి ఒక రేటు నిర్ణయించి అందని కాడికి దోచుకున్నారని సమాచారం.

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 29: అడ్డగోలు ఉద్యోగోన్నతులు, అక్రమాలకు గుంటూరు దేవదాయశాఖ కేంద్రంగా మారింది. అసిస్టెంట్ కమిషనర్ క్యాడర్‌లో ఉన్న ఓ అధికారి ఉద్యోగోన్నతిపై విమర్శలున్నాయి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ ఉద్యోగోన్నతులు జరిగాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఓ అధికారి ఎటువంటి అదనపు బాధ్యతలు లేకుండానే నేరుగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర స్థాయి అధికారులు అప్పట్లో ఇచ్చిన ఈ ఉత్తర్వులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో కీలక పోస్టులోకి వెళ్లిన ఆ అధికారి ఐదేళ్లపాటు దేవదాయ శాఖను దోచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా బాధ్యతలు చేపట్టి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో అన్ని గ్రూపు దేవాలయాలపై పెత్తనం చేస్తూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన అనుయాయుడైన ఓ అధికారిని కార్యాలయంలో కీలక పోస్టులో నియమించుకుని అడ్డగోలుగా దోచేశారని తెలిసింది. ట్రెజరీ నుంచి కూడా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. కనీసం ట్రెజరీ అధికారులు కూడా ఈ విషయాన్ని గుర్తించకుండా జీతాలు కట్టబెట్టారని కొందరు ఉద్యోగులు తెలిపారు. అడ్డగోలుగా తాను కీలక బాధ్యతలు నిర్వహించడమే కాకుండా తన పరిధిలో ఉన్న అధికారం వినియోగించుకుని అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. ఉద్యోగోన్నతి పేరుతో గుంటూరు జిల్లాలో ఓ డివిజన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి నుంచి రూ.2 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. సీనియర్లను కాదని జూనియర్ అయిన మరో ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించి రూ.3 లక్షల తీసుకున్నట్లు ఆరోపణన్నాయి. ఇలా దేవదాయశాఖ పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 200 మంది ఉద్యోగులకు అక్రమంగా ఉద్యోగోన్నతులు ఇచ్చి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక సిబ్బంది కావాలంటూ అవుట్‌సోర్సింగ్ విధానంలో అనేకమందిని నియమించుకుని వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలా దేవదాయ శాఖలో ఐదేళ్లుగా ఆ అధికారి అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని ఆ శాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. తనిఖీల పేరుతో ప్రతీ ఆలయానికి వెళ్లడం రూ.వేలల్లో డిమాండ్ చేసి వసూలు చేయడం ఓ ఆనవాయితీగా ఆ అధికారి చేసుకున్నట్లు విమర్శలున్నాయి. ప్రతీ ఏడాది బడ్జెట్ ఆమోదించాల్సి ఉండగా దానికి కూడా ఓ రేటు పెట్టి.. ఆ ప్రకారం డబ్బులు వసూలు చేశారని తెలిసింది. దీంతో మూడు జిల్లాల్లోని ఆలయాల్లో పనిచేసే ఈవోలు, మేనేజర్లు బెంబేలెత్తి పోయారని తెలిసింది. ఎప్పుడు వచ్చి తమపై పడతారు.. ఎంత డిమాండ్ చేస్తారో అంటూ ఉద్యోగులు హడలెత్తేవారంటే ఆశ్చర్యం కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ అధికారి ఇటీవల వరకు చేసిన అక్రమాలు, అవినీతి తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఆరు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఆ అధికారి తిరిగి పాత పోస్టులోనే వేరే జిల్లాకు వెళ్లారని సమాచారం.

- స్వయంగా హాజరు కానున్న సీఎం చంద్రబాబు
- రేపు ఉదయం 6 గంటలకు లబ్ధిదారులకు నేరుగా పంపిణీ
- అనంతరం గ్రామంలో లబ్ధిదారులతో చంద్రబాబు ముఖాముఖీ
- గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెనుమాక నుంచే..

పింఛన్ల పండుగ

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నందున అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ అనంతరం జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో చంద్రబాబు ముఖాముఖీ మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డీఆర్‌వో పెద్ది రోజ, గుంటూరు ఆర్‌డీవో పీశ్రీఖర్, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, సిపిఓ శేషశ్రీ, డిఈఓ శైలజ, డీఎస్‌వో కోమలి పద్మ పాల్గొన్నారు.

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీకి సిద్ధమైంది. పింఛన్ల పండుగను గుంటూరు జిల్లా నుంచే ప్రారంభించనున్నారు. ఇంటింటికీ రూ.7 వేలును నేరుగా లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమరావతి రాజ, దాని పరిధిలోని తాడేపల్లి మండలం పెనుమాక నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 1వ తేదీ సోమవారం తెల తెలవారుతుండగానే సీఎం చంద్రబాబు స్వయంగా పెనుమాకలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం స్వయంగా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక గ్రామంలో సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. స్వయంగా ముఖ్యమంత్రి పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటారని తెలియడంతో గ్రామంలో సందడి నెలకొంది. అధికారులు, పోలీసులు బందో బస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం కలెక్టర్ నాగలక్ష్మి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు గ్రామంలో చంద్రబాబు పింఛన్లు అందజేసే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.



సీఎం రాక కోసం రహదారికి మరమ్మతులు

వైసీపీ మోసం.. చెప్పినట్లు చేస్తోన్న టీడీపీ

సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ల పెంపు హామీ ఒక గేమ్ ఛేంజర్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాకముందు పింఛన్‌ని రూ.3 వేలకు పెంచుతామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను మోసగించింది. ఏడాదికి రూ.250 చొప్పున పెంచడంతో అవి వారికి ఏమాత్రం అక్కరకు రాలేకపోయాయి. దాని వల్ల పింఛన్‌దారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమని మోసగించిన జగన్‌కి తగిన బుద్ధి చెప్పేందుకు ఎప్పుడెప్పుడు అవకాశం వస్తుందా అని ఐదేళ్లు ఎదురు చూశారు. కాగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలలో భాగంగా పింఛన్‌ని రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే పెంచిన పింఛన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఎన్నికల సమయంలో పెన్షన్ల పంపిణీ సక్రమంగా చేయకుండా వైసీపీ ప్రభుత్వం చేసిన ఇబ్బందులు చూసి ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంచుతానని, దానిని జూలై నెల ఒకటో తేదీన ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రస్తుత నెల రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి రూ.వెయ్యి చొప్పున మూడు నెలలకు కలిపి రూ.3 వేలు మొత్తంగా రూ.7 వేలు పంపిణీకి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు శనివారం బ్యాంకుల నుంచి సచివాలయాల సిబ్బంది నగదు డ్రా చేశారు.



- రోగుల చికిత్సలపై మంత్రి పెమ్మసానికి వివరిస్తున్న వైద్యురాలు

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతాయుతంగా పని చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఆస్పత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారంపై శనివారం ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సెల్వరాజన్‌తో కలిసి ఆయన సమీక్షించారు. - గుంటూరు(మెడికల్)

విద్యార్థుల ఆందోళన..

వీసీ రాజీనామా

- ఛాంబర్‌కు తాళంతో దిగొచ్చిన రాజశేఖర్
- ఏఎన్‌యూలో ఐదేళ్ల అరాచక పాలనకు విముక్తి

పెదకాకాని, జూన్ 29: వైసీపీతో అంటకాగి.. వైసీపీ సేవలో తరించి.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య రాజశేఖర్ తీరుపై విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఆయా విద్యార్థులు వర్సిటీలో ర్యాలీ చేసి అనంతరం వీసీ ఛాంబర్‌కు తాళాలు వేసి ధర్నా చేశాయి. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు రాజీనామా చేశారని, కానీ నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ మాత్రం రాజీనామా చేయలేదని మండిపడ్డారు. వర్సిటీలో పెద్దఎత్తున దోపిడీలు చేసి, వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన రాజశేఖర్‌కు వీసీగా కొనసాగే అర్హత లేదన్నారు. వీసీని చాంబర్‌కు రానిచ్చే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ విషయం తెలిసిన వీసీ రాజశేఖర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్‌యాదవ్, నాయకులు భాగ్యరాజు, జనసేన అధ్యక్షుడు జగదీష్, నాయకులు శ్రీను, అవినాష్, రామకృష్ణ, యశ్వంత్, ఖాయూమ్, పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంగా వర్సిటీ

2019 సెప్టెంబరులో విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియమితులయ్యారు. 2022 సెప్టెంబరు 28 నుంచి రాజశేఖర్‌ను రెగ్యులర్ వీసీగా నియమించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీగా నియమితులైనప్పటి నుంచి ఆయన వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చారన్న విమర్శలున్నాయి. విద్యకు నిలయమైన విశ్వవిద్యాలయంలో అప్పటి సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిల పుట్టినరోజు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహాన్ని తొలుతగా ఏఎన్‌ఎలో ఏర్పాటు చేసి విశ్వవిద్యాలయాల్లో రాజకీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు నాంది పలికారనే విమర్శలు మూటగట్టుకున్నారు. తన అనుచరులందరికీ అతిధి అధ్యాపక ఉద్యోగాలతో పాటు ప్రోగ్రామర్ తదితర ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే వర్సిటీ డిపాజిట్లు రూ.కోట్లలో దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. బూటకపు ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు దళిత, బీసీ వర్గాలకు చెందిన అతిథి అధ్యాపకుల పొట్ట కొట్టారన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రకటించిన మూడు రాజధానులకు మద్దతుగా వర్సిటీలో వీసీ ప్రత్యేకంగా సదస్సులు, సెమినార్లు నిర్వహించారు. మూడు రాజధానులపై ఓ పుస్తకం కూడా ముద్రించారు. వైసీపీ ప్లీనరీ సమావేశాల సందర్భంగా వర్సిటీలో పరీక్షలను వాయిదా వేసి ప్రాంగణాన్ని వైసీపీ వారి వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం ఆయన రాజీనామాతో వర్సిటీలో ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలికినట్లుగా విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.



వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాల నాయకులు

మళ్లీ వాళ్లేనా..?



- ఈసీ మార్గదర్శకాల ప్రకారం గతంలో అధికారుల బదిలీలు
- వీరిలో చాలామంది వైసీపీ నేతలకు కొమ్ముకాసిన వారే
- ప్రాధాన్య పోస్టుల కోసం టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షణలు

బాపట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగేళ్ల పాటు వైసీపీ నేతాగణం ఆడమన్నట్లు ఆడారు.. వారి దోపిడీకి ఇష్టారీతిన సహకరించారు.. రెవెన్యూ మొదలు పోలీస్ శాఖ వరకు అందరూ వైసీపీ నేతల సేవలో తరించిన వారే.. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఎన్నికల కమిషన్ నిబంధనలతో పాటు స్థానికత, మూడేళ్ల పాటు ఒకే చోట పని ఇలాంటి మార్గదర్శకాలను అనుసరించి పలువురు బదిలీపై వెళ్లిపోయారు. సీన్ కట్ చేస్తే కూటమి ప్రభుత్వం భారీ మెజారిటీతో కొలువుదీరింది. వైసీపీ సేవలో తరించిన సదరు అధికారులే ఇప్పుడు వేరే చోట టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుని కీలక పోస్టుల్లోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు జిల్లాలో పోస్టింగ్ పొందిన వారు సైతం వైసీపీ నేతల సిఫారసుతో వచ్చిన వారే కావడంతో సదరు నేతల సేవలో తరించి వారి రుణం తీర్చుకున్నారు. తాజాగా వీరు ఉన్న చోటే కుదురుకోవడానికి తాము నిష్పక్షపాతంగా పనిచేశామనే కొత్త పల్లవి ఎత్తుకుని టీడీపీ నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కీలక పోస్టింగ్‌ల విషయంలో టీడీపీ నేతలు అప్రమత్తంగా లేకపోతే వైసీపీలో హవా కొనసాగించి టీడీపీ శ్రేణులను ఇబ్బది పెట్టినవారే ఇప్పుడు కూడా పెత్తనం చెలాయించే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిబంధనల ఊసే మరిచారు...

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన భానుప్రతాప్ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాలనే ప్రభుత్వ ఉత్తర్వులుగా భావించి పనిచేశారు. రోడ్డు విస్తరణ పనులు చేసే క్రమంలో చిరువ్యాపారులు మొదలుకుని ఎంతోమంది ఆయన బాధితులే. ఎన్నికలకు నాలుగునెలల ముందు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. తాజాగా ఆయన ఒంగోలు కమిషనర్ పోస్టింగ్‌ను దక్కించుకోవడానికి అక్కడి టీడీపీ నేత చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని సమాచారం. గతంలో బాపట్ల మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఒకరు కలెక్టర్ ఆదేశాలతో కూడా పని లేకుండా కేవలం అప్పటి ఎమ్మెల్యే చెప్పారనే కారణంతో ఎస్టీల గుడిసెలు తొలగించడం స్వామిభక్తికి పరాకాష్టగా నిలిచింది. దీనికి సంబంధించి అప్పట్లో వీఆర్వో మీద చర్యలు తీసుకున్న అధికారులు తహసీల్దార్‌ను మాత్రం వివరణతో సరిపెట్టారు. కీలక స్థానంలో పోస్టింగ్ కోసం ఈ తహసీల్దార్ కూడా టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉమ్మడి ప్రకాశంలో సీఐగా పనిచేసినప్పుడు టీడీపీ సానుభూతిపరులపైన కేసుపెట్టి వేధించిన వ్యక్తి ప్రస్తుతం బాపట్ల పరిధిలో సీఐగా ఉన్నారు. ఈయన కూడా టీడీపీ పల్లవి ఎత్తుకుని ఇక్కడే తిష్ట వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. బాలుడు అమర్నాథ్ గౌడ్ హత్య ఉదంతంలో వైసీపీకి కొమ్ముకాశారనే విమర్శ ఎదుర్కొన్న చెరుకుపల్లి పరిధిలో అప్పట్లో సీఐగా పనిచేసిన వ్యక్తికి సైతం వేరే చోట కీలక పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక ఆయా విభాగాలకు జిల్లా అధికారులు కొత్తగా వచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో చాలా మంది వైసీపీ నేతల ప్రాపకంతో వచ్చిన వారే కావడంతో అడిగిందే తడవుగా నిబంధనలను తోసి రాజని సైతం వారి సేవలో తరించారు. వీరిలో చాలా మంది ఎన్నికలకు మూడు నెలల ముందు ఈసీ ఆదేశాల ప్రకారం వేరే ప్రాంతాలలో అప్రాధాన్య పోస్టులలో నియమించ బడ్డారు. నిబంధనల ప్రకారం రెవెన్యూ, పంచాయతీ విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన వారు తిరిగి ఇప్పుడు యథాస్థానాల్లోకి వచ్చే అవకాశం ఉంది. వీరితో పాటు గతంలో జిల్లాలో పనిచేసి వెళ్లిన అధికారులు సైతం ఇక్కడకు కాకుండా వేరే జిల్లాలో పోస్టింగ్‌ల కోసమే ప్రయత్నాలు చేయడం కొసమెరుపు. గతంలో పనిచేసిన చోట సదరు అధికారి ఎలా వ్యవహరించారన్నది స్థానిక నేతలకు అవగాహన ఉంటుంది కనుక దానిని తప్పించుకోవడానికి పూర్తిగా కొత్త ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడి టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

అప్రమత్తత ముఖ్యం..

కీలక స్థానాల్లో పోస్టింగ్‌ల విషయంలో టీడీపీ నేతలు అప్రమత్తంగా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ ఏలుబడిలో నిజంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులతో పాటు పోలీసులకు నిబంధనల ప్రకారం ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైసీపీ నేతల వేధింపులు తట్టుకోలేక సెలవుపై వెళ్లిన అధికారులూ ఉన్నారు. కూటమి పాలనలో వారందరికీ న్యాయం జరగాల్సి ఉంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి వైసీపీ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి వారిని గుర్తించాల్సిన అవసరం ఉంది.

డీజీపీని కలసిన ఎంపీ రాయలు



డీజీపీలో ఎంపీ లావు, మక్కెన, జిలాని

నరసరావుపేట, జూన్ 29: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును టీడీపీ పార్లమెంటరీ పార్టీనేత లావు శ్రీకృష్ణ దేవరాయలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ద్వారకా తిరుమలరావుని కలసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడులోని ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలాని ఉన్నారు

ప్రభుత్వాస్పత్రిలో నిర్మాణాలపై.. విజిలెన్స్ విచారణ



ప్రభుత్వ ఆస్పత్రిలో పర్యటిస్తున్న పెమ్మసాని, నసీర్ అహ్మద్, రామాంజనేయులు, కలెక్టర్

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు
- ఏళ్ల తరబడి నిర్మాణాలు జరగడం పట్ల విస్మయం
- శాసన సభ్యులతో కలసి జీజీహెచ్‌లో తనిఖీలు

గుంటూరు (మెడికల్), జూన్ 29: 'గుంటూరు ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న భవన నిర్మాణాల కాంట్రాక్టర్లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణ జరిపించి ఏ స్థాయిలో తప్పు జరిగినా వెలికి తీయాలని' కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్‌ను ఆదేశించారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్, శాసన సభ్యులు మమహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణకుమార్‌లతో కలసి ఆయన పర్యటించారు. పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో గత ఏడేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన విజిటర్స్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించిన మంత్రి పెమ్మసాని, ఇన్నేళ్లుగా ఆ భవన నిర్మాణం పూర్తి కాకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. అప్పటి డీపీఆర్‌లకు అనువుగా నిధులు విడుదలైనా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ఏమిటని? సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. దీనికి సరైన సమాధానం ఇవ్వలేకపోవడంతో ..ఈ నిర్మాణాల కాంట్రాక్టర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలని మంత్రి పెమ్మసాని ఆదేశించారు. తప్పు చేసింది నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ స్థాయిలో తప్పు జరిగిందో వెలికి తీయాలని ఆయన స్పష్టం చేశారు. త్వరలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేయాలని సొసైటీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ నాగలక్ష్మికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

ప్రభుత్వ వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి...

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం స్థానిక శాసనసభ్యులను సమన్వయం చేసుకొని ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆయన ప్రకటించారు అనంతరం నాట్కో కేన్సర్ విభాగంలోని సెమినార్ హాల్‌లో వైద్యాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన ప్రాథమిక వివరాలు, వైద్య విభాగాలు, రోగులకు అందిస్తున్న సేవలు, మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు, జింకానా, నాట్కో ట్రస్ట్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలు, విభాగాలవారీగా పరిష్కరించాల్సిన సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. సంబంధి వైద్య విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పెమ్మసానికి వివరించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ సీటీ స్కాన్ మెషిన్‌కు సంబంధిత ఏజెన్సీ ద్వారా తక్షణం మరమత్తులు చేయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు నసీర్‌అహ్మద్, గళ్లా మాధవి, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్ పలు అంశాలపై సూచనలు అందిస్తూ కేంద్రీకృతంగా ఉన్న వైద్య పరికరాలు, ఇతర సేవల నిర్వహణను వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఆర్‌డీ సీహెచ్ సుధారాణి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ సతీష్ కుమార్, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ పీవీ హనుమంతరావు, నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బియ్యం బకాసురుల బండారం త్వరలోనే బట్టబయలు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 29: రాష్ట్రంలో పేదల బియ్యం బొక్కేసి అడ్డదారుల్లో వేలకోట్లకు పడగలెత్తిన వైసీపీ బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు కావటం ఖాయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కొద్దిరోజులుగా పౌరసరఫరాలశాఖలో వెలుగుచూస్తున్న విస్తుపోయే వాస్తవాల నేపథ్యంలో శనివారం విడుదలచేసిన పత్రికాప్రకటనలో గడిచిన ఐదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రేషన్‌బియ్యం అక్రమాలన్నీ తవ్వితీయాల్సిన సమయం వచ్చిందన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఏఏ దేశాలకు ఎంతెంత దొంగతనంగా ఎగుమతులు చేశారు?, ఆ బియ్యం ఏఏ ప్రాంతాల నుంచి అక్కడికి ఎలా చేర్చారో మొత్తం వెలికితీస్తే సగంమంది వైసీపీ నేతలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. మాజీ మంత్రి విడదల రజినిపై కూడా ఇదే విషయంలో తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల బియ్యాన్ని దారి మళ్ళించి మిల్లుల ద్వారా వేలకోట్లు వెనకేసుకున్న పెత్తందారులు, వారికి వెన్నుదన్నుగా నిలిచినవారిని చట్టం ముందు నిలబెట్టాల్సి ఉందన్నారు. చెప్పినమాట ప్రకారం తొలి ఐదు సంతకాల్లోనే పింఛన్ల పెంపునకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబును పేదలంతా గుండెల్లో పెట్టుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థికకష్టాల్లో ఉండి ప్రతి నెల వందల కోట్ల భారం పడుతున్నా ఇచ్చినమాట ప్రకారం పింఛన్‌ను రూ.4వేలు చేసిన నిజమైన చాంపియన్ చంద్రబాబు అని ప్రత్తి పాటి కొనియాడారు.

గుంటూరు - బెంగళూరు ఇంటర్‌సిటీకి పెమ్మసాని ప్రతిపాదన

- విశాఖ - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరుకు వచ్చే అవకాశం
- రైల్వే జీఎం నుంచి బోర్డుకు వెళ్లిన ప్రతిపాదనలు

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నిత్యం పగటిపూట ఒక ఇంటర్‌సిటీ రైలుని గుంటూరు-బెంగళూరు- గుంటూరు మధ్యన నడపాలని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసా ని చంద్రశేఖర్ ప్రతిపాదించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ప్రజలకు బెంగళూరు వెళ్లేందుకు ఉదయం ఎలాంటి రైలు సదుపాయం అందుబాటులో లేదు. దీనికి సంబంధించిన ప్రతి పాదన దక్షిణమధ్య రైల్వేజోన్ నుంచి కేంద్ర రైల్వేబోర్డుకు వెళ్లిం ది. ఈ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపితే త్వరలోనే బెంగ ళూరుకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం ఇక్కడి ప్ర యాణీకులకు అందుబాటులోకి వస్తుంది. అమరావతి రాజధా ని నగరాన్ని గుంటూరు జిల్లా కలిగివున్న దృష్ట్యా ఏపీ, కర్నాటక క్యాపిటల్స్ మధ్యన ఈ రైలు ప్రయాణిస్తుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీ ర్లు చాలామంది బెంగళూరు పరిసరాల్లో విధులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే అమరావతి రాజధానిలోనూ సాఫ్టువేర్ పరిశ్రమ విస్తరించనుంది. ఈ నేపథ్యంలో గుంటూరు-బెంగళూరు ఇంటర్ సిటీరైలుకు ఆక్యుపెన్సీ బావుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌ తోంది. ప్రస్తుతం విశాఖపట్టణం-ఎల్‌టీటీ(ముంబై) మధ్యన నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరు మీదగా మళ్లించా లని కొన్నినెలలుగా రైల్వే వినియోగదారులు కోరుతున్నారు. ఈ రైలు ప్రస్తుతం విజయవాడ నుంచి కాజీపేట మార్గంలో సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. కేవలం కాజీపేట రైల్వేస్టేషన్‌లో మాత్రమే నిలుపుదల సౌకర్యం ఉన్నది. మరోవైపు కాజీపేటకు ఎల్‌టీటీ వెళ్లే రైళ్లు మరికొన్ని ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు మీదగా ఎల్‌టీటీ రైలుని మళ్లిస్తే గుంటూరు, పల్నాడు, నల్గొండ జిల్లాల ప్రయాణీకులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే శాఖ ఈ రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు ప్రతిపాదించింది. ఈ విషయాన్ని కూడా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళితే కొద్ది రోజుల్లోనే ముంబైకి డైలీ రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజీనామా చేయాలి

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



ఆర్కిటెక్చర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, జూన్ 29: ఏఎన్‌యూలో ఆర్కిటెక్చర్ కాలేజి ప్రిన్సిపల్ ఈదర శ్రీనివాస రెడ్డి ప్రభుత్వం మారినా తన తీరు మార్చుకోకుండా వైసీపీ నాయకుడు వలే ప్రవర్తిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ ఆరోపించారు. శనివారం వర్సిటీలో ఆయన ప్రిన్సిపాల్‌ని కలిసి ఉద్యోగానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో వైసీపీ అనుకూలంగా ఓటు వేయమని విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించారని ఆరోపించారు. ఇంజనీరింగ్ కళాశాల పేరు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలగా మారటానికి ప్రధమపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, హరీష్, ఎస్డీ గౌస్ యశ్వంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అక్రమాలపై సీఐడీ విచారణ జరపాలి

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు జి.భాగ్యరాజు

పెదకాకాని, జూన్ 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్లుగా జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని వర్సిటీ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు జి.భాగ్యరాజు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కలిసి వర్సిటీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా భాగ్యరాజు మాట్లాడుతూ వీసీ రాజశేఖర్‌పై చక్రపాణి కమిటీ విచారణ జరుగుతుందన్నారు. అయినా నిబంధనలకి విరుద్ధంగా సజ్జల రామకృష్ణారెడ్డి ఆయనకు వీసీ పదవిని కట్టబెట్టారని తెలిపారు. వీసీ రాజశేఖర్, సజ్జల కలసి యూనివర్సిటీ నిధులలో రూ. కోట్లల్లో అక్రమాలు చేశారన్నారు యూనివర్సిటీ బడ్జెట్ మీద విచారణ జరిపి ప్రొఫెసర్ నాగరాజు, మధుబా బు, ఉదయకుమార్‌లపై కూడా ఏపీ సీఐడీచే విచారణ జరిపించాలని భాగ్యరాజు కోరారు.

కమిషనర్ భార్య.. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం

- సామాన్యులకు ఆదర్శం... కమిషనర్‌ను అభినందించిన ప్రజానీకం



ఏరియా వైద్యశాలలో భార్య, బిడ్డతో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్

బాపట్ల, జూన్ 29: ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కేవలం పేదప్రజలే వైద్యసేవలు పొందుతారనేది నానుడి. ఎంతోకొంత ఆర్థికస్థోమత ఉన్నవారంతా ప్రైవేటు వైద్యశాలలలోనే చికిత్స పొందటానికి ఇష్టపడుతుంటారు. ఇవన్నీ కాదంటూ అందరికి ప్రభుత్వవైద్యశాలలో మంచి వైద్యం అందుతుందని బాపట్ల మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తన భార్యకు ఏరియావైద్యశాలలో కాన్పుచేయించి ఆదర్శంగా నిలిచారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ పర్యవేక్షణలో వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి కమిషనర్ భార్యకు కాన్పు చేశారు. ప్రభుత్వ వైద్యశాల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేలా కమిషనర్ అనుసరించిన విధానాన్ని అందరు హర్షిస్తున్నారు.

భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్ భేటీ



కొమ్మాలపాటితో ఎమ్మెల్యే ప్రవీణ్

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో శనివారం భేటీ అయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా పని చేసినవారిని గుర్తుపెట్టుకొని వారికి అవసరమైన సహకారం అందించాలని, సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ప్రవీణ్‌కు శ్రీధర్ సూచించారు. కొందరు రెండు పడవల పై కాళ్లపెట్టిన రీతిలో వ్యవహరించారని అలాంటివారిని పార్టీకి దూరంగా ఉంచాలని సూచించారు. చిన్నవయసులో ప్రతిష్ఠాత్మకమైన విజయం సాధించే అవకాశం దక్కిందని, ప్రజల మన్ననలు పొందేలా ముందుకు సాగాలని ప్రవీణ్‌కు కొమ్మాలపాటి సలహా ఇచ్చారు.

అమరావతికి రండి

- నేపాల్ మాజీ ప్రధానికి జాస్తి ఆహ్వానం




నేపాల్ మాజీ ప్రధాని లోకేంద్ర బహదూర్ చంద్‌కు ఫోటోని బహూకరిస్తున్న డాక్టర్ జాస్తి

గుంటూరు సిటీ, జూన్ 29: బౌద్ధ మత ఆనవాళ్లతో విలసిల్లుతున్న అమరావతికి రావాలంటూ నేపాల్ మాజీ ప్రధానమంత్రి లోకేంద్ర బహదూర్ చంద్‌ను అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్య క్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆహ్వానించారు. శనివారం నేపాల్ రాజధాని ఖాట్మండులో బహదూర్‌చంద్‌తో భేటీ అయిన ఆయన నాలుగోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయు డు అమరావతి నిర్మాణం కోసం చేస్తున్న కృషిని వివరించారు. చంద్రబాబునాయుడు సంక ల్పం నెరవేరి అమరావతి దేవతలు కొలువుండే రాజధానిగా విలసిల్లుతుందని ఈ సందర్భం గా నేపాల్ మాజీ ప్రధానమంత్రి ఆకాంక్షించారని జాస్తి ప్రకటనలో తెలిపారు. నేపాల్ మాజీ ప్రధాని, ఆయన సతీమణి ఆర్ట్ ఫోటోని బహూకరించారు.

నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీలో శిక్షణ

గుంటూరు(విద్య), జూన్ 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, చేబ్రోలులోని స్కిల్‌హబ్ నందు డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందులో మూడు నెలలపాటు యువతకి నైపుణ్య శిక్షణ కల్పించివారిని స్థానికంగా జిలాలోవున్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ లేదా ఆపైన విద్యార్హతలున్నవారు జులై 3 లోపు స్కిల్‌హబ్‌నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9666545975 నందు సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సూరె ముక్కంటి (ఫైల్‌ఫొటో)

రాజుపాలెం, జూన్ 29: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామశివారు చల్లపల్లి తండాలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఇనిమెట్ల గ్రామానికి చెందిన సూరె ముక్కంటి(42) తాపీమేస్త్రిగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే చల్లపల్లి తండాలో ఓ ఇంటి నిర్మాణ నిమిత్తం పరంజా కడుతున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైరు తగిలింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముక్కంటిని చికిత్స నిమిత్తం ఆటోలో హాస్పటల్‌కు తీసుకువెళ్లారు. మార్గంమధ్యంలోనే ప్రాణాలుపోయినట్లు చెబుతున్నారు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు.

కుడికాలువలో జారిపడి వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

మాచర్ల రూరల్, జూన్ 29: ప్రమాదవశాత్తూ కుడి కాలువలో జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. బెల్లంకొండ మండలం వన్నాయపాలెంకు చెందిన గడ్డం శ్రీనివాసరావు(40) మాచర్ల మండలం కొప్పునూరులోని తన మామ చీరబోయిన మల్లయ్య ఇంటి వద్ద పదినెలలుగా ఉంటున్నాడు. నాలుగు నెలలుగా అదే గ్రామానికి చెందిన గన్నెబోయిన శ్రీను వద్ద జీవాలను మేపేందుకు జీతానికి కుదిరాడు. శుక్రవారం మధ్యాహ్నం జీవాలను కుడి కాలువ వద్ద కడుగుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో కొట్టుకుపోయాడు. మృతుని భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం శ్రీనివాసరావు మృతదేహాన్ని కుడికాలువ నుంచి బయటకు తీశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని మృతదేహం

మాచర్ల రూరల్, జూన్ 29: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్ కొత్త బ్రిడ్జి వద్ద శుక్రవారం అర్థరాత్రి చోటుచేసుకుంది. నాగార్జున సాగర్ బోర్డర్ చెక్‌పోస్టు నుంచి తెలంగాణకు వెళ్లే దారిలోని విజయపురిసౌత్ కొత్త బ్రిడ్జి వద్ద శనివారం పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. శుక్రవారం అర్థరాత్రి సమయంలో బ్రిడ్జి నుంచి దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు బావిస్తున్నారు. మృతుని వయసు సుమారు 65 సంవత్సరాలుగా దాకా ఉంటుంది. ఒంటిపై లైట్ గ్రీన్ కలర్ గీతలు గల టీషర్ట్, బ్లూ కలర్ గీతలు గల లుంగీ ధరించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

రేపటి నుంచి ద్విచక్రవాహనదారుడికి హెల్మెట్ తప్పనిసరి

- హెల్మెట్ ధరించకపోతే రూ.వెయ్యి జరిమాన
- బాపట్ల ప్రజల ప్రాణాలే నాకు ముఖ్యం
- బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్రవర్మ

కర్లపాలెం, జూన్ 29 : బాపట్ల నియోజకవర్గంలో ఏ రోడ్డు ప్రమాదంలో కూడా యువకులు, ప్రజలు ప్రాణాలు కోల్పోకూడదని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దృఢ నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గంలో నెలరోజుల వ్యవధిలో ముగ్గురుపైగా రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయారని నరేంద్రవర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ శనివారం ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనం నడుపుతూ హెల్మెట్ ధరించని వారికి రూ.వెయ్యి జరిమాన వసూళ్ళు చేయమని పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ ఆదేశాలు జూలై 1 నుంచి నియోజకవర్గంలోని పోలీసులు అమలు చేస్తారన్నారు. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం బాధ వర్ణణాతీతమన్నారు. కుటుంబానికి కడుపుకోతతోపాటు ఇంట్లో మగదిక్కులేక పిల్లలు, భార్య, అనాధలు అవుతారని ఆందోళన చెందారు. నియోజకవర్గంలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. పోలీసువారు ద్విచక్ర వాహనం ఆపిన సమయంలో నాకు ఫోన్ చేసినా హెల్మెట్ ధరించకపోతే రూ.1000 జరిమాన చెల్లించాల్సిందేనన్నారు. రూ.600 నుంచి రూ.2 వేల వరకు హెల్మెట్ ధర ఉంటుందని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. నియోజకవర్గంలో ఏ తల్లి, తండ్రికి కడుపుకోత రానీయనన్నారు. నియోజకవర్గంలో తనను గెలిపించటానికి పోరాటం చేసిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని నరేంద్రవర్మ స్పష్టం చేశారు. 20 సంవత్సరాల తర్వాత ఉమ్మడి కూటమి అభ్యర్థిగా తనను 27 వేల పైచిలుకు ఓట్ల భారీ మెజార్టీతో నియోజకవర్గ ప్రజలు గెలిపించారన్నారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి ఎజెండాగా పని చేస్తానని, అవినీతికి తావులేకుండా నీతివంతమైన పాలన అందిస్తానన్నారు. ప్రజలకు నాయకుడిలా కాకుండా సేవకుడిలా పని చేస్తానని నరేంద్రవర్మ అన్నారు.

కేంద్రమంత్రి గడ్కారీకి ప్రతిపాదనలు చేసిన ఎంపీ తెన్నేటి



కేంద్రమంత్రి నితిన్ గడ్కారీకి వినతిపత్రం అందజేసి వివరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, జూన్ 29 : బాపట్ల నుంచి విజయవాడ వరకు 65 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరుతూ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శనివారం దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీకి ప్రతిపాదనలు చేశారు. తద్వారా నిజాంపట్నం పోర్ట్, సెజ్, బాపట్ల-చీరాల బీచ్‌లు, చీరాలలోని టెక్స్‌టైల్‌పార్క్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా బాపట్లలో ఏర్పాటు కాబోయే ఐటి హబ్, బయోటెక్ సిటికి కనెక్టివిటి పెరుగుతుందని తెలిపారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూన్ 29 : తెలుగుదేశం పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్లలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ జెండాను పార్టీ శ్రేణులతో కలిసి నరేంద్రవర్మ ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు ఓటమి పాలౌతున్న తెలుగుదేశం పార్టీని ఈ ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పనిచేస్తానన్నారు. రాజీవ్‌గాంధీకాలనీలోని యానాదులకు ప్రత్యేక కాలనీ నిర్మిస్తానని హామినిచ్చారు. 1 నుంచి 8 వార్డుల వరకు తాగునీరు అందించేందుకు నిర్మించిన ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. పురపాలక సంఘానికి ప్రతి ఏడాది 13 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వస్తుందన్నారు. రానున్న రోజులలో మరో 2 కోట్ల రూపాయలు అదనంగా వచ్చే ప్రయత్నం చేస్తానని చెప్పారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించటంతోపాటు సురక్షితమైన నీరు అందిస్తానని హామినిచ్చారు. వైసీపీ పాలనలో అక్రమ కట్టడాలకు ప్రజాప్రతినిధులు అండగా నిలిచారని అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని నరేంద్రవర్మ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, వార్డు కమిటీ నాయకులు యలవల వెంకటేశ్వరరావు, మద్దిబోయన భావన్నారాయణ, యలవల శ్రీనివాసరావు, బొడ్డు గోవిందు, వై.శివశంకరరావు, రావుల వీరబ్రహ్మం, కృష్ణవేణి, బండి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభలో ఎమ్మెల్యే నరేంద్రవర్మను సన్మానిస్తున్న వార్డుకమిటీ నాయకులు

జాతీయ లోక్ అదాలత్‌లో 70 కేసుల పరిష్కారం

బాపట్లరూరల్, జూన్ 29 : జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ గుంటూరు ఆదేశాల మేరకు శనివారం బాపట్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 70 కేసులను పరిష్కరించటం జరిగిందని, 55 లక్షల 10 వేల రూపాయల లావాదేవీలు జరిగాయని జాతీయ లోక్ అదాలత్ చైర్మన్ కెపి బాలాజి తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ అదనపు జిల్లా జడ్జి జి.వాణి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, బాపట్ల వారు కేసులను పరిష్కరించారు.



జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసులను పరిష్కరిస్తున్న జాతీయ లోక్ అదాలత్ చైర్మన్ కేపీ బాలాజి, ఆరవ అదనపు జిల్లా జడ్జి జి.వాణి తదితరులు

ఘనంగా జాతీయ కెమెరా దినోత్సవం

బాపట్ల, జూన్ 29 : భావపురి ఫొటోగ్రాఫర్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ కెమెరా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా పితామహుడు లూయిస్ డాగురే పటానికి పుష్పాంజలి ఘటించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కెమెరా రాకముందు ఒక చిత్రరూపంలో ఒక భావం చెప్పాలంటే చిత్రకారులు కొన్నిరోజులు శ్రమించి ఒక చిత్రాన్ని గీసే వారని అధ్యక్షుడు సిద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి షేక్ జానీ, దాని నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కొల్లూరు, జూన్ 29 : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున మండల పరిధిలోని పెదలంక సమీపంలోని కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను వివిధ ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో ఎస్ఐ తన సిబ్బందితో స్వాధీనం చేసుకుని మూడు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మృతికి సంతాపం

బాపట్ల, జూన్ 29 : ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా, ఎంపీగా పని చేసిన డి.శ్రీనివాస్ మృతికి బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి సంతాపం ప్రకటించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శ్రీనివాస్‌తో సత్సంబంధాలు ఉండేవని, మంచి నాయకుడిగా అందరిని కలుపుకుపోయే శ్రీనివాస్ మృతి తీరనిలోటు అని గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూన్ 29 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సమర్దవంతమైన విద్యావిధానం ఉన్నప్పటికి ప్రైవేట్ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరగటానికి గల కారణాలు తెలుసుకొని లోపాలను సరిదిద్ది మెరుగైన ఫలితాలు సాధించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బాపట్లలో 146 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 48 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 76 శాతం ఫలితాలు సాధిస్తే ప్రైవేట్ పాఠశాలలో 95 శాతం ఫలితాలు సాధించటం గురించి ఆరా తీశారు. ఎంఈవోలు పాఠశాలలో తనిఖీలు చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేసి మంచి ఫలితాలు పెంచాలన్నారు. త్వరలో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులు వస్తారు కావున నూతన విద్యావిధానం అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా చదువుకొని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయుడు ఆకుల సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.నిరంజన్, ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఓ.శ్రీదేవి, అడే బుజ్జి, వై.రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు మందపాటి ఆంద్రేయ, ఉప్పాల కృష్ణగౌడ్, విన్నకోట వీరయ్యనాయుడు, తిరుమలశెట్టి సాంబశివరావు, నర్రా సర్వేశ్వరరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జయప్రకాష్ నారాయణ



పల్లా శ్రీనివాసరావును కలిసి సత్కరిస్తున్న తాతా జయప్రకాష్ నారాయణ, హరిశ్చంద్రప్రసాద్

బాపట్ల, జూన్ 29 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించబడిన పల్లా శ్రీనివాసరావును శనివారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, తాతా హరిశ్చంద్రప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి సన్మానించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పార్టీ కార్యక్రమాలు గురించి చర్చించారు.

ఆదర్శ ఉద్యోగి రామస్వామి

వేమూరు, జూన్ 29 : వేమూరులోని పశు వైద్యశాలలో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన పొనుగుపాటి రామస్వామి దంపతులను శనివారం స్థానిక పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొని రామస్వామి సేవలను కొనియాడుతూ ఆదర్శ ఉద్యోగిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి డీడీ కార్యాలయ ఏడీ డాక్టర్ ఆర్.వి.శ్రీనివాసరావు, గుంటూరు ఏపీఎల్‌డీఏ ఏడీ డాక్టర్ వై.కోటేశ్వరరావు, తెనాలి ఏడీ డాక్టర్ జి.నరేంద్రబాబు, డాక్టర్ చలపతిరావు, పి.శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. పలువురు రైతులు హాజరై రామస్వామిని సత్కరించారు.



రామస్వామి దంపతులను సత్కరిస్తున్న పశు సంవర్ధకశాఖ అధికారులు

వేదవతి సేవలు ప్రశంసనీయం

బాపట్ల, జూన్ 29 : ఉత్తమ అధ్యాపకురాలిగా, ప్రిన్సిపాల్‌గా మూడున్నర దశాబ్దాలకు పైగా సేవలందించిన జి.వేదవతి సేవలు చిరస్మరణీయమని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పి.ఎర్రయ్య అన్నారు. పట్టణంలోని సరస్వతీ మెమోరియల్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వేదవతి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కళాశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేదవతి దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రమణరావు, డాక్టర్ పీసీ సాయిబాబు పాల్గొన్నారు.

అధ్యాపకుడు లలితంకు ఘన సన్మానం

బాపట్ల, జూన్ 29 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వై.లలితం ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. నాలుగు దశాబ్దాలుగా కళాశాలలో ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బోధన,బోధనేతర సిబ్బంది, కళాశాల యాజమాన్యం పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి..

పిట్టలవానిపాలెం, జూన్ 29 : మండలంలోని చందోలు నీలిబంగారయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా విద్యాబోధనందిస్తూ ఉద్యోగ విరమణ చేసిన దాసరి వెంకట శివనాగ ప్రసాద్ దంపతులను మండల విద్యాశాఖాధికారి -1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు శనివారం పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకుమాను మండల విద్యాశాఖాధికారి-1 కె.విజయభాస్కర్, పిట్టలవానిపాలెం మండల ఎంఈవో-2 కె.రాజారత్నం, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె.బుల్లెమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కరీముల్లా, మండల యూటీఎఫ్, ఎస్‌టీయూ, ఏపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, చందోలుగ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ రామకోటయ్యకు...

భట్టిప్రోలు, జూన్ 29 : రామకోటయ్య ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని ఎంఈఓలు పులి లాజరు, ఎన్.దేవరాజ్ అన్నారు. మండలంలోని పెదపులివర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బండి రామకోటయ్య పదవీ విరమణ సభ శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. సహచర ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు రామకోటయ్య దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె. హరిబాబు, హెచ్‌ఎం జి.స్వామి, డాక్టర్ కె. పృధ్వీగణేష్, డాక్టర్ నాగశ్రీ, పెద్దలు సజ్జా సుబ్బారావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మాధవరావు సేవలు అభినందనీయం : ఎంపీపీ

కర్లపాలెం, జూన్ 29 : ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని ఎంపీపీ యారం వనజ అన్నారు. కర్లపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగవిరమణ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు బి.మాధవరావు దంపతులను శనివారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన అభినందన సభలో ఎంపీపీ వనజ, ఎంపీడీవో నేతాజి పాల్గొని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.విజయశ్రీ, ఉపాధ్యాయులు ఇ.పోలీసురావు, ఎం.ఇందుమతి, డిఎల్ ప్రసన్నలక్ష్మీ, బి.రాజేష్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి పార్టీ శ్రేణులకు అండగా ఉంటా : వేగేశన

కర్లపాలెం, జూన్ 29 : బాపట్ల నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని నల్లమోతువారిపాలెంలో టీడీపీ నాయకులు నర్రావుల పున్నయ్య కూటమి గెలుపు సందర్భంగా శ్రీపెద్దింటమ్మ అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటున్న కార్యక్రమంలో నరేంద్రవర్మ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పున్నయ్య ఏర్పాటు చేయగా నరేంద్రవర్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్కల వెంకటస్వామి, నూరినేని మురళీకృష్ణ, మాడా శ్రీనివాసరావు, బుద్దా కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, ఘట్టా సూరయ్య, మునిపల్లె చిన్న, రాజశేఖర్, ఏపూరి భూపతిరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దేపల్లిలో టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం

- వైఎస్సార్ విగ్రహానికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- అద్దేపల్లిలో ఉద్రిక్తత... చెదరగొట్టిన పోలీసులు

భట్టిప్రోలు, జూన్ 29 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ శ్రేణులు గ్రామాల్లో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేందుకు పూనుకుంటున్నారు. మండలంలోని భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలో గల టీడీపీ జెండా దిమ్మెను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వైసీపీ పరాజయం పాలవడంతో ఓర్చుకోలేని వైసీపీ శ్రేణులు టీడీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేసి అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తున్నారని టీడీపీ శ్రేణులు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. ఇదిలాఉండగా శనివారం తెల్లవారుజామున అద్దేపల్లిలో గల వైఎస్సార్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ శ్రేణులే నిప్పు పెట్టి ఉంటారని ఆరోపిస్తూ సంఘటన స్థలానికి వైసీపీ శ్రేణులు చేరుకున్నారు. ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, వేమూరు సీఐ పి.రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయానికి విరాళం

రేపల్లె, జూన్ 29 : నగరం గ్రామంలో గల శ్రీగిరిపురంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య దంపతులు రూ.50 వేలు అన్నదాన కార్యక్రమానికి అందించారు. శ్రీగిరిపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నర్రా సుబ్బయ్య ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కోసం తనవంతు ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం సుబ్బయ్య దంపతులను ఆలయ చైర్మన్ తూనుగుంట్ల జగదీష్‌కుమార్, సెక్రటరీ సీతాపతి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, వెంకటశేష సాయిప్రసాద్, శివ సాంబయ్య, తాడివాక హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 93 కేసుల పరిష్కారం

రేపల్లె, జూన్ 29 : కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో 93 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ కేసులు 11, క్రిమినల్ కేసులు 76, ప్రీలిటికల్ కేసులు 66, మొత్తం 93 కేసులు పరిష్కారం కాగా కక్షిదారులకు సుమారు రూ.25 లక్షలు పరిష్కారం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.రూపశ్రీ, న్యాయవాది హరికుమార్, కృష్ణారావు, పోలీస్ సిబ్బంది, బీఎస్ఎన్ఎల్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



జాతీయ లోకాదలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు

అగ్నిబాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

రేపల్లె, జూన్ 29 : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటంలో రెడ్‌క్రాస్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు గౌరీశంకర్ అన్నారు. నిజాంపట్నం మండలం అడవులదీవి శివారు మేకావారిపాలెంలో శనివారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన గృహాల వారికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు, ఇళ్ళపై వేసుకునే పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. రెడ్ క్రాస్ తరుపున తమవంతు సహాయాన్ని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బి.బసవరావు, మాజీ ఎంపీపీ శ్రీనివాసు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసు పాల్గొన్నారు.

ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలి : ఏవో

చెరుకుపల్లి, జూన్ 29 : ఖరీఫ్ సాగు చేసే కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతుల గుర్తింపు కార్డులు పొందాలని ఏవో టి.బాలాజీ గంగాధర్ చెప్పారు. ఆయన శనివారం మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డు 11 నెలలు మాత్రమే పని చేస్తుందన్నారు. కౌలు రైతులకు భూమిపై ఎలాంటి హక్కు ఉండదన్నారు. సొంత రైతు పొలం పాస్‌బుక్ జిరాక్స్, 1బి జిరాక్స్ రైతు ఆధార్‌నెంబర్, రైతు పాస్ పోర్టు సైజు పొటోలు 3 ఇవ్వాలన్నారు. మీ గ్రామాలలోని వీఆర్‌వోలను, వీఏఏలను కలిసి కౌలు రైతుల గుర్తింపు కార్డులు పొందాలన్నారు.

వలివేరులో కంటి పరీక్షలు

చుండూరు జూన్ 29 : తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వలివేరులోని ఈమని వారి కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తెనాలి శంకర నేత్రాలయానికి చెందిన వైద్యులు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఫిరోజ్‌ఖాన్‌ల పర్యవేక్షణలో వారి వైద్య బృందం ఈ పరీక్షలను నిర్వహించారు. ఇందులో 173 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఇందులో 42 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని, వీరికి త్వరలోనే ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వలివేరు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రామస్వామి మృతి తీరని లోటు : సీపీఎం

భట్టిప్రోలు, జూన్ 29 : నిమ్మగడ్డ రామస్వామి మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని అక్కివారిపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు నిమ్మగడ్డ రామస్వామి (102) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. సీపీఎం నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో భట్టిప్రోలు, కొల్లూరు మండల నాయకులు జి.సుధాకర్, వేములపల్లి వెంకట్రామయ్య, జి.నాగరాజు, ఆరోను, డేవిడ్, రాంబాబు, పి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే ఆనందబాబు పర్యటన

- ఐదు మండలాల్లో పింఛన్లు పంపిణీకి హాజరు

వేమూరు, జూన్ 29 : వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సోమవారం నియోజకవర్గంలోని ఐదు మండలాలలో పర్యటించనున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారని క్యాంపు కార్యాలయ సమాచారం. వేమూరు మండలం జంపని గ్రామంలో 9.30 గంటలకు, కొల్లూరు 10.30 గంటలకు, భట్టిప్రోలు 11.30 గంటలకు, అమృతలూరు 12 గంటలకు, చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయ వంతం చేయాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

కొల్లూరు, జూన్ 29 : అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సీహెచ్‌వో జి.విజయ కార్యకర్తలకు సూచించారు. అనంతవరం గ్రామంలో శనివారం అంగన్‌వాడీ సెక్టార్ సమావేశాన్ని సూపర్‌వైజరు నగరాజకుమారి నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సీహెచ్‌వో కేంద్రాలకు వచ్చే చిన్నారులు దోమల బారిన పడకుండా పరిసరాలలో మురుగు నీరు నిల్వ లేకుండా, దోమల ఉత్పత్తి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు అందించే ఆహారం వేడిగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని పిల్లలకు ఇవ్వాలన్నారు. మండల ప్రత్యేక రిసోర్స్‌పర్సన్ ధనరాజ్ మాట్లాడుతూ కేంద్రాల పరిధిలో ఒక సంవత్సరం నుంచి 18 సంవత్సరాల గల ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడానికి కార్యకర్తలకు అవసరమైన సూచనలు చేశారు. వారిని కేంద్రాలకు తీసుకువచ్చి కొల్లూరు గౌడపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక అవసరాలు గల వారికి ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి వంటి సేవలు అందించడం జరుగుతుందన్నారు. మండల కేంద్రం కొల్లూరు ఎస్సీ కమ్యూనిటీ హాలులో కొల్లూరు సెక్టార్ సమావేశాన్ని సూపర్‌వైజర్ విజయలక్ష్మి నిర్వహించారు.



సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ ధనరాజ్

కౌలు రైతులు అర్హత పత్రాన్ని పొందాలి : ఆర్డీవో

రేపల్లె, జూన్ 29 : అర్హులైన ప్రతి ఒక్క కౌలు రైతు అర్హత పత్రాలను పొందటం ద్వారానే ప్రభుత్వం అందించే పథకాలను పొందుతారని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. నగరం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 8 వేల మంది కౌలు రైతులు ఉన్నారని, ఇప్పటి వరకు 900 మంది కౌలు రైతులకు పత్రాలను అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సి.శిల్ప, డిప్యూటీ తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



కౌలురైతులకు గుర్తింపు కార్డులను అందిస్తున్న ఆర్డీవో హేలా షారోన్

పురపాలక సంఘ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె, జూన్ 29 : వర్షాకాలం సమీపిస్తుండటంతో అంటువ్యాధులు విజృంభించకుండా చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పురపాలక సంఘ అభివృద్ధి కోసం సమష్టి కృషితో ముందుకు వెళ్ళనున్నట్లు తెలిపారు. వర్షాకాలం కావటంతో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు విజృంభించకుండా బ్లీచింగ్ ఫాగింగ్ చేయాలని సూచించారు. అనంతరం 27 అంశాలను కౌన్సిల్ ముందు ఉంచగా 26 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించగా ఒక్క అంశాన్ని తిరస్కరించారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారు ది.06-06-2024న ప్రచురించిన దోనేపూడి లక్ష్మీ సౌజన్య గారి యాడ్‌లో లోన్ పేరు దోనేపూడి లక్ష్మీ సౌజన్య అని తప్పుగా పడినది దీనిని పెనుమూడి జయంతరావు అని చదువు కొనగలరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

దిక్సూచి
DIKSUCHI

అగ్రి డిప్లొమాలు



ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in

డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-సేవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉం టుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియా యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13
- **వెబ్‌సైట్:** www.uceou.edu

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/soMebZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఫహాద్‌పై సుమోటో కేసు

మలయాళ నటుడు, నిర్మాత ఫహద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో



అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహద్‌పై కేసు నమోదు చేసింది.

'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టి ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉపముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన ఆర్టిస్టుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.

గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మి కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.


స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను



తమన్నా

దక్షిణాదిన అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడి పాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో' చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.

'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయుర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశ' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.



పూజలందుకుంటున్న కోదండరామస్వామి

వైభవంగా ఆలయ వార్షిక పూజలు

చినగంజాం, జూన్ 29 : మండలంలోని కడవకుదురు గ్రామంలోని సీతాలక్ష్మణ్ హనుమత్ సమేత కోదండరామ స్వామి దేవస్థాన 10వ వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానంలో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. సాయంత్రం వేదపారాణం, విష్వక్సేన ఆరాధన, రక్షాబంధనపూజ, పంచగవ్వ ఆరాధన, ప్రాశన, రక్షాధారణ, ఆచార్యాది ఋత్విగ్వరణం, అఖండదీపారాధన, అంకురారోపణ, వాస్తు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సాల్గొన్నారు.

అడుగంటిన మంచినీటి చెరువులు

- పర్చూరులో ముంచుకొస్తున్న ఎద్దడి
- ఆందోళనలో ప్రజలు



పర్చూరులోని మంచినీటి చెరువు

పర్చూరు, జూన్ 29 : మంచినీటి చెరువులు అడుగంటాయి. దీంతో తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. నాచు, తామరతో కలుషితమై కంపుకొడుతున్న నీటితో ప్రజలు రోజులు వెల్లబుచ్చుతున్నారు. ఫిల్టర్ బెడ్‌లు అలంకారప్రాయంగా మారాయి. అదే నీటిని నేరుగా ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఎక్కించి పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి మంచినీటిగా వినియోగిస్తున్నారు. అయితే ప్రస్తుతం పర్చూరులో ఉన్న రెండు మంచిటిని చెవుల్లో ఒక చెరువు పూర్తిగా అడుగంటింది. మరో చెరువులో అరకొరగా నీరు ఉంది. అదే నీటిని ప్రజల అవసరాల కోసం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సక్రమంగా వర్షాలు కురవక పోవడం, సాగర్, కొమ్మమూరు కాలువల్లో నీరు లేకపోవడంతో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కారంచేడు కొమ్మమూరు కాలవ నుంచి గతంలో రూ.4కోట్లతో అన్నంబొట్లంవారిపాలెం వరకు పైపులైన్ ఏర్పాటు చేసినా పర్చూరు చెరువుకు చుక్కనీరు చేరని పరిస్థితి. దీంతో సాగర్ కాలువ నీరు విడుదల సమయంలో పర్చూరు వాగుకు చేరిన నీటిని మోటార్‌ల సహాయంతో పర్చూరు మంచి నీటి చెరువులకు నింపుకోవాల్సి ఉంది. ఇటీవల మంచినీటి అవసరాల కోసం నీటిని విడదల చేసినా పర్చూరు చెరువుకు చుక్కనీరు కూడా చేరలేదు. అధికారులు సమన్వయంగా పనిచేయక పోవడం వల్లే నీటిని చెరువులకు నింపుకోలేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం చెరువుల పరిస్థితిని, ఉన్న నీటి పరిమాణాన్ని చూస్తే తాగునీటి ఎద్దడి ముంచుకొచ్చే ప్రమాదం ఉందని ప్నజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

వృద్ధులపై ప్రేమతో మెలగాలి

- సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి
- లోక్ అదాలత్‌లో 152 కేసుల పరిష్కారం

అద్దంకి, జూన్29 : వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రేమతో మెలగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం శింగరకొండలోని కష్టజీవుల జాతీయ సేవా సంఘం వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి వృద్ధాశ్రమాన్ని పరిశీలించి వృద్ధుల యోగక్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

152 కేసుల పరిష్కారం

అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 152 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత అధ్యక్షతన రెండు బెంచ్‌లలో లోక్ అదాలత్ కేసులను పరిష్కరించారు. 105 క్రిమినల్ కేసులు, 8 మనోవర్తి కేసులు, 4 కుటుంబ తగాదాలు, 2 చెక్కు బౌన్స్ కేసులు, 4 గృహ హింస కేసులు, 23 ప్రో నోటు కేసులు, ఇతర కేసులు, 2 ప్రిలిటిగేషన్ కేసులు, 4 ఈపీ కేసులు పరిష్కారం అయ్యాయి. లోక్ అదాలత్ సభ్యులు గృహలక్ష్మి, ఎం.ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు, హైగ్రీవాచారి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారంపై దృష్టి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఈఈ నల్లూరి

అద్దంకి, జూన్ 29 : విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి పట్టణంలో లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు పాత దామావారిపాలెం, ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను శనివారం ఈఈ నల్లూరి ప్రారంభించారు. అనంతరం కట్టకిందపాలెం, పెరికపాలెంలో ఈఈ పర్యటించి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఈఈ సత్యనారాయణ, టౌన్ ఏఈ శివ ప్రసాద్, టీడీపీ నాయకులు చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, కోనేటి అనిల్, కుందారపు రామారావు, మున్నంగి స్టాలిన్, మదీనా, వలి, మాలిక్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

చినగంజాం, జూన్ 29 : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 1వతేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి శనివారం తెలిపారు. 12 గ్రామ పంచాయతీల్లోని 13 సచివాలయాల పరిధిలో 6,040 మంది లబ్ధిదారులకు గ్రామ సచివాలయాలయ 123 మంది ఉద్యోగులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ అందజేస్తారని తెలిపారు. జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని, లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని వేణుగోపాలకృష్ణమూర్తి సూచించారు.

పింఛన్‌ల పంపిణీ పర్యవేక్షణకు అధికారులు

బల్లికురవ, జూన్ 29 : నూరు శాతం పింఛన్‌ల పంపిణీ జరిగేలా పర్యవేక్షణ అధికారులను నియమించనున్నట్లు ఎంపీడీవో హనుమారెడ్డి శనివారం తెలిపారు. సోమవారం అన్ని గ్రామాలలో పింఛన్‌లను సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒక్క రోజులోనే అంద రికీ అందిస్తామన్నారు. మండలంలోని 21 పంచాయతీలలో 7842 మందికి పింఛన్‌లు అందనుండగా, ఒకొక్కరికీ రూ.7వేలను అందిస్తామన్నారు. పింఛన్‌దారులు ఇళ్ల వద్ద ఉండాలని సూచించారు.

దొంగతనాలపై కేసు

పంగులూరు, జూన్ 29 : మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం జరిగిన దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. సంఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. ముప్పవరంలో దొడ్డి నాగేంద్రం, తిరుమలశెట్టి వినోద్‌కుమార్ ఇళ్ళలో జరిగిన చోరీకి సంబంధించి విచారణ చేపట్టామని, అనుమానితులను పరిశీలిస్తున్నామని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

దాడి కేసులో ఎనిమిదిమంది అరెస్ట్

అద్దంకి, జూన్ 29 : మండలంలోని తిమ్మాయపాలెం ఇటుక బట్టీల వద్ద ఈ నెల 21వ తేదీ రాత్రి శంకరాపురానికి చెందిన వ్యక్తులు అదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులపై దాడి చేశారు. ఈ కేసులో ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన 8 మందిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

మార్టూరు, జూన్ 29 : చేతులు పరిశుభ్రతతో 80 శాతం రోగాలను దూరం చేయవచ్చునని, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో నితిన్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మార్టూరు, కారంచేడు ఇంకొల్లు మండలాలలోని ప్రాథమిక పాఠశాలల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు డెటాల్ బనేగా స్వస్థ ఇండియా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రతపై సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవెలెప్ మెంట్, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల్లో హైజీన్ హీరోస్, చిన్నారి డాక్టర్స్ అనే కార్యక్రమాలు ద్వారా ర్యాలీలు, వ్యాసరచన, డ్రాయింగ్, స్కిట్, క్విజ్ పోటీలను వచ్చే నెల 2 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడానికి 7 రకాల సూత్రాలను పాటించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం డీటీఎస్ఐ ప్రతినిధి జీనళిని మాట్లాడుతూ పాఠశాలల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఎంపీడీవో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యంఈవో లు వస్రాం నాయక్, ప్రేమలత,రీసోర్ పర్సన్ లు గోడె ప్రసాద్, సాడ్స్ ప్రతినిదులు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్



రామోజీ, జమున, హేమలత చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ ప్రతినిధులు

తెలుగు హాస్యానికి చిరునామా జంధ్యాల

అద్దంకి, జూన్ 29 : చక్కని హాస్యానికి చిరునామా జంధ్యాల అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు అన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మల సేవాసదన్‌లో ప్రతిభామూర్తులు - మధుర స్మృతులు 33వ సభ జరిగింది. ఈ సందర్భంగా రామోజీరావు, సినీ నటి జమున, దర్శకులు జంధ్యాల, అద్దంకి హేమలత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు చందలూరి నారాయణరావు, దాసరి లక్ష్మీరాజ్యం, మంగమూరి చిరంజీవి, అన్నమనేని వెంకటరావు, పీసీహెచ్ కోటయ్య, ఆర్‌వీ రాఘవరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, లేవి ప్రసాద్, బాలు, మక్కెన చిన్నా, వీవీ బ్రహ్మం, చెన్నుపాటి రామాంజనేయులు, వై. వెంకటేశ్వర్లు, రఘురామశర్మ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య భవిష్యత్‌కు మూలాధారం



విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న ఎంఈవో సుధారాణి

చీరాలటౌన్, జూన్ 29 : ప్రతి విద్యార్థి జీవితంలో ప్రాథమిక భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుందని ఎంఈవో-2 సుధారాణి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన షైనార్టీ విద్యార్థులు పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎమ్ఈవో మునిసిపల్ పరిధిలోని గంజిపాలెం, అసఫ్ ఆలీ ఉర్దూ ప్రైమరీ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల రికార్డులను నిశితంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలను స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకట్రావు



జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న నేతలు

ఇంకొల్లు, జూన్ 29 : టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి గ్రామాలలో అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజి వెంకట్రావు కోరారు. మండలంలోని పావులూరులో టీడీపీ, జనసేన పార్టీల జెండాను ఆవిష్కరించారు. జనసేన పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, జనసేన పార్టీ నాయకులు నారిశెట్టి ప్రవీణ్, రాంబాబు, వెంకట్రావు, వెంకటనారాయణ, గుంజి అనిల్‌కుమార్, బేతపూడి సురేష్‌బాబు, రవిచంద్ర, రమేష్, రవీ, బట్టు శ్రీనివాసరావు,పావులూరు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఇంట పింఛన్‌ల పండుగ

ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, జూన్ 29 : నవ్యాంధ్రలో జూలై 1వ తేదీన ప్రతి పేద ఇంట్లో పండుగ వాతావరణం కన్పించనుంది.. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పండుగను ఊరువాడ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రకటలో తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పిం ఛన్ల సొమ్ము పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆ మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే సంబంధిత పత్రంపై సంతకం చేశారని ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేశారు. ఒకటవ తేదీనే సచివాలయం సిబ్బందితో అన్ని శాఖల సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి పింఛన్‌ను వృద్ధులు, దివ్యాంగులకు అం దించేలా అన్నిరకాల చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యా యం జరిగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రజా ప్రభుత్వం ఇదన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే చంద్రన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిందన్నారు. ఎన్నికలకు ముందే మేనిఫెస్టోలో చెప్పినట్లు పెన్షన్‌ను ఒకే సారి రూ.1000 పెంచామని రూ.4000 పెన్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ఇకపై రూ.6000 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పాలకుడు సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరుమీద పెన్షన్ల కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసిందన్నారు. ప్రజల భద్రత మా బాధ్యత అన్నారు. ప్రజలు సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని, ఎప్పుడూ మంచి చేయాలన్న తలంపుతో ఉన్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఏలూరి కోరారు. గత ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలను చిదిమేసిందన్నారు. పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అమలు చేయలేదన్నారు. ఒక్కసారి ఇవ్వాల్సిన రూ.1000ని ఏడాదికి రూ.250 మాత్రమే పెంచి చివరి ఏడాది వరకు ఇస్తూ అవ్వాతాతలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. పేదల ఇంట ఆనందం నింపాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం జూలై 1న ఇచ్చే రూ.4000తో పాటు ప్రకటించిన నెల నుంచి ఏప్రిల్, మే, జూన్‌కు రూ.1000 చొప్పున రూ.3000 అదనంగా కలిపి మొత్తం రూ.7000 ఒకటవ తేదీన అందజేయనుందని ఏలూరి పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతేసంగతులు..!

- మార్టూరు-కొణిదెన వెళ్లే రోడ్డులో గుంత
- పొంచి ఉన్న ప్రమాదాలు
- చర్యలు చేపట్టాలని ప్రయాణికుల విజ్ఞప్తి



కొణిదెన రోడ్‌లో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

మార్టూరు, జూన్ 29 : కొంచెం ఏమరపాటుగా ఉన్నామో ద్విచక్రవాహనంతో గుంతలో పడిపోవలసిందే.. గతంలోనూ కొంతమంది ద్విచక్రవాహనదారులు అదేవిధంగా పడిపోయారు. ఈ ప్రమాదం మార్టూరులో మినీ అండర్ పాస్ నుంచి కొణిదెన వెళ్లే రోడ్‌లో పొంచి ఉంది. అక్కడ రోడ్డుకు ఒక వైపు సైడ కాల్వను పూర్తిగా నిర్మాణం చేయకపోవడంతో పెద్ద గుంత ఏర్పడింది. దాంతో ఈ గుంత పెద్దగా వాహనదారులకు కనిపించకపోవడంతో ద్విచక్రవాహనదారులు గుంతలో పడిపోతున్నారు. దానికి తోడు మార్టూరులోని పెద్ద అండరు పాస్ నుంచి వచ్చే వాహనదారులు, కొణిదెన రోడ్ వైపు నుంచి మార్టూరు సెంటరుకు వచ్చే వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు మలుపు దాటవలసి ఉండటంతో ఈ మలుపు వద్ద ఉన్న గుంత సక్రమంగా వాహనదారులకు కనిపించదు. ఈ కారణంగా వారానికి ఒక ప్రమాదమైనా ఈ గుంత వద్ద జరుగుతున్నది. రెండు రోజుల క్రితం ఒక ద్విచక్రవాహనదారుడు భార్యా పిల్లలతో కలిసి గుంతలో పడిపోయాడు. మరో ఆటోవాలా కూడా గుంతలో పడిపోయాడు. గ్రామ పంచాయతీ వారు గుంత వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలను చేపట్టవలసిన అవసరం ఉంది.

వ్యవసాయ కనెక్షన్‌లకు నగదు డిమాండ్ చేస్తే చర్యలు

విద్యుత్ శాఖ డీఈఈ సురేంద్రబాబు



మాట్లాడుతున్న డీఈఈ సురేంద్రబాబు

బల్లికురవ. జూన్ 29 : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రైతుల నుంచి నగదు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ మార్టూరు సబ్‌డివిజన్ డీఈఈ ఎం. సురేంద్రబాబు హెచ్చరించారు. శనివారం బల్లికురవలోని విద్యుత్ కార్యాలయంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తుపై డీఈఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం పెట్టిన దరఖాస్తులను పరిశీలించి వరుస క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేస్తామని తెలిపారు. రైతులు డీడీకి రూ.6200 మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరైనా దళారులు గానీ, విద్యుత్ సిబ్బంది గానీ అదనంగా డబ్బులు అడిగితే వెంటనే 9493174291కు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ లైన్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఎక్కడైనా మరమ్మతులు గురైన స్తంభాలను తమ దృష్టికి తెస్తే సరిచస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కావాల్సిన రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న సిబ్బందిని సంప్రదించాలని డీఈఈ సురేంద్రబాబు కోరారు. సమావేశంలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి

చెరుకూరు (పర్చూరు), జూన్ 29 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచేలా కార్యకర్తలు కృషి చేయాలని చెరుకూరు సూపర్‌వైజర్ రాధా కోరారు. శనివారం పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేతులు శుభ్రత, వ్యాధులపై అవగాహన నిర్వహించారు. యోగా కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలసి నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకూరు సెక్టార్ పరిధిలోని కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పంటల సాగుపై అవగాహన

మార్టూరు, జూన్ 29 : కృషి జీవన్ సహకారంతో గాండీవ రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బాలాజీ అపార్ట్‌మెంట్ పక్కన చెరుకూరి బిల్డింగ్‌లో పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ పెంట్యాల శరత్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. భూసార ప్రాముఖ్యత, పంట మార్పిడి ఆవశ్యకత సాగులో పలురకాల పంటల ప్రాధాన్యతపై సదస్సులో సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. హాజరయ్యే రైతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కేవలం 50 మంది రైతులకు మాత్రమే అవకాశం ఉందని ఆసక్తిగలిగిన వారు 9553301949 నంబరును సంప్రదించాలన్నారు.



సన్మాన గ్రహీతలను సత్కరిస్తున్న ప్రతినిధులు

గురువుల ఆశీస్సులు అందుకోవాలి

చీరాలటౌన్, జూన్ 29 : విద్యార్థులు నిత్యం క్రమశిక్షణతో నడుచుకొని గురువుల ఆశీస్సులు అందుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎర్రయ్య అన్నారు. సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాలకు చెందిన హిందీ లెక్చరర్ డా.కొణిదల రమేష్, ఫిజిక్స్ లెక్చరర్ ఖాద్రీ, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో వారిని ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించారు. కళాశాల, విద్యార్థుల అభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విద్యాసాగరరావు, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం

ఇంకొల్లు, జూన్ 29 : మండలంలోని గొల్లపాలెం గ్రామంలో శనివారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన ఇంకొల్లు మండల చెన్నకేశవ ప్రాథమిక సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు చల్లపల్లి వెంకటేశ్వర్లు(98) మృతి చెందారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులను అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు కమలేశ్వరరావు, స్వామి, ట్రెజరర్ సాంబశివరావు, సభ్యులు అభినందించారు.

రెండోరోజు దుద్దుకూరు మీదుగా పాదయాత్ర

- స్వాగతం పలికిన టీడీపీ నాయకులు
- వేంకటేశ్వరస్వామికి విరాళం అందజేత



దుద్దుకూరులో డీడీని అందజేస్తున్న నేతలు

ఇంకొల్లు, జూన్ 29 : అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో అమరావతి మహిళలు, రైతులు మొక్కులు తీర్చుకునేందుకు వెంకటపాలెం నుంచి తిరుపతికి చేపట్టిన పాదయాత్ర రెండవ రోజు శనివారం ఇంకొల్లు మండలంలో కొనసాగింది. 5వ రోజు శుక్రవారం ఇంకొల్లు చేరుకోగా, రాత్రికి ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బస చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు ఇంకొల్లు నుంచి ప్రారంభమైన పాదయాత్ర కొణికి, దుద్దుకూరు గ్రామాల వరకు సాగింది. పాదయాత్ర రైతులకు అల్పాహారం, బోజనాలను స్థానిన టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఎంఏఆర్ఎస్ ట్రస్ట్ ద్వారా రూ.10,116 డీడీని వేంకటేశ్వర స్వామి ఉండీలో వేయాలని దుద్దుకూరు గ్రామ సర్పంచ్ మల్లెం శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ మన్నె చింపిరయ్య రైతులకు అందజేసారు. పాదయాత్రగా వచ్చిన వారిని స్థానిక టీడీపీ నాయకులు, మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టౌన్ ప్రెసిడెంట్ మార్క్, కరి శ్రీనివాసరావు, సాంబయ్య, బోడావుల శివయ్య, అనంతలక్ష్మి, నాగేంద్రం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు సురేష్, జయకృష్ణ, కృష్ణారావు, అనుపమ, అనిత, ప్రసన్న, చెన్నకేశవరావు, శివకుమారి, రేణుక, సంధ్య, రత్నకుమారి కృతజ్ఞతలు తెలిపారు.